నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | మే 16, 2024 | www.navatelangana.com

సెల్‌ఫోన్ రికవరీ.. బాధితుడికి అప్పగింత



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సిఇఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకొని మంగళవారం బాధితుడికి ఫోన్ అందించినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన రేవుల సాయిరాం తన సెల్ ఫోన్‌ను ఏప్రిల్ 7న ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో పోగొట్టుకున్నాడు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఆయన ఫిర్యాదు మేరకు సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి సెల్ ఫోన్ గుర్తించి స్వాధీనం చేసుకుని బాధితునికి అందించామని తెలిపారు.

వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

- సెట్విన్ కో-ఆర్డినేటర్ సయ్యద్ మొహిజోద్దీన్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని సెట్విన్ ప్రభుత్వ సంస్థ ద్వారా వివిధ వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తులను కోరుతున్నట్లు సెట్విన్ కో-ఆర్డినేటర్ సయ్యద్ మొహిజోద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ, పిజిడిసిఏ, టైలరింగ్ ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గంవర్క్, మెహెంది కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ తీసుకుంటున్న వారికి ఉచిత స్టడీ మెటీరియల్‌తో పాటు కోర్స్ ఫీజులో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తామని వివరించారు. కోర్స్ పూర్తి చేసిన తర్వాత సెట్విన్ ప్రభుత్వ సంస్థ ద్వారా ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7386180456, 7989199121 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

డెడ్ స్టోరేజీకి పోచారం ప్రాజెక్టు

- అడుగంటిన నీరు
- వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే ప్రాజెక్టులోకి నీరు
- ఆయకట్టు రైతుల్లో ఆందోళన




ప్రాజెక్టులో అడుగంటిపోయిన నీరు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి రెండు మండలాలకు వరప్రదాయిని అయిన పోచారం ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం పూర్తిగా అడుగంటిపోయి డెడ్ స్టోరేజీకి చేరింది. గత వర్షాకాలం, యాసంగి లో పుష్కలంగా నీరందించిన ఈ ప్రాజెక్టు.. ప్రస్తుతం పూర్తిగా అడుగంటిపోయింది. ఈ వర్షాకాలంలో వానలు సమృద్ధిగా కురిస్తేనే ప్రాజెక్టు నిండే అవకాశం ఉంది. ప్రాజెక్టు పూర్తిగా అడుగంటి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పోచారం ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 14.64 అడుగులు (1.820) టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 0.121 టిఎంసి నీరు మాత్రమే ఉంది. ఈసారి ఖరీఫ్, రబీ 2 పంటల సాగు ప్రాజెక్టు ద్వారా నీటి పారుదల శాఖ అధికారులు నీటిని అందించారు. గత వర్షాకాలంలో పుష్కలంగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండింది. అధికారిక లెక్కల ప్రకారం వర్షాకాలంలో నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి మండలాలకు చెందిన 10,500 ఎకరాలకు సాగునీరు అందించగా అనధికార లెక్కల ప్రకారం 17వేల ఎకరాలకు సాగునీరు అందించింది. అలాగే రబీ సీజన్‌లో ప్రాజెక్టు పరిధిలో బీజోన్‌కు చెందిన ఎల్లారెడ్డి మండలంలోని సాగు భూములకు ప్రాజెక్టు ద్వారా నీరు అందించారు. ప్రస్తుతం పోచారం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరింది. నాగిరెడ్డిపేట్ మండలం వ్యాప్తంగా పోచారం ప్రాజెక్టుపైనే ఎక్కువ మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండితే నాగిరెడ్డిపేట్ మండలంలో గల బోరుబావులు పుష్కలంగా నీరును అందిస్తాయి. యాసంగి పంట ముగించుకొని వర్షాకాల పంటకు రైతులు సిద్ధమవుతున్నారు. వర్షాకాలం కంటే ముందే వర్షాలు కురవడం ప్రారంభం కావడంతో రైతులందరూ పొలాలను దున్నే పనిలో పడ్డారు. నాగిరెడ్డిపేట్ మండలంలో చిన్న కొద్దిపాటి వర్షానికి అక్కడక్కడ దున్నకాలు ప్రారంభించారు రైతులు. ఈసారి కూడా వర్షాలు సమృద్ధిగా కురిసి పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండితే రెండు పంటలు పండే అవకాశం ఉంది.

మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ఉబ్బి పూజిత భర్త అయిన సాయిబాబా తన అన్న కొడుకైన చిరంజీవులతో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన అనంతరం పూజిత తన భర్తతో నువ్వు చిరంజీవితో ఎందుకు తిరుగుతున్నావ్ అని ప్రశ్నించగా.. ఇది విని మనసులో పెట్టుకున్న చిరంజీవులు మే 2న పూజిత తన ఇంట్లో ఉండగా చిరంజీవులు దౌర్జన్యంగా ఆమెను తిడుతూ ఒక పైపుతో పూజితపై దాడి చేశాడు. ఆమె శరీరంపై వాతలు రావడంతో ఆమె ఫిర్యాదు చేయడంతో చిరంజీవులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేతన వెతలు

పార్ట్ టైం ఆఫ్ ఫారస్ ఉద్యోగులకు నెలలు గడిచినా అందని వేతనం

- ఏండ్లు గడిచినా భద్రత లేని ఉద్యోగం
- చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్న వైనం
- దయతలచని ప్రభుత్వాలు

ప్రభుత్వ ఉద్యోగం అంటే భద్రతతో కూడిన వేతనం, పలు రకాల సౌకర్యాలు కల్పిస్తూ ప్రభుత్వం నియమిస్తూ ఉంటుంది. కానీ పాఠశాలలో పనిచేస్తున్న పార్ట్ టైం ఆఫ్ ఫారస్ ఉద్యోగులు మాత్రం చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ వేతనాలపై ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా.. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకిచ్చే అరకొర వేతనం కూడా సరైన సమయానికి అందకపోవడంతో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని పార్ట్ టైం ఆఫ్ ఫారస్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నవతెలంగాణ-రామారెడ్డి

ప్రభుత్వ పాఠశాలలో ఉదయం తాళాలు తీయడం, గదులను శుభ్రం చేయడం, విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం తాగునీరు ఏర్పాటు చేయడం, ప్రతిజ్ఞ కోసం బెల్లు కొట్టడం, సాయంత్రం సామగ్రి గదిలో ఉంచడం, భద్రంగా తాళాలు వేయడం కోసం ప్రభుత్వం పార్ట్ టైం ఆఫ్ ఫారస్ ఉద్యోగులను గతంలో నియమించింది. 1981, 1985, 1993 సంవత్సరాల్లో అప్పటి ప్రభుత్వాలు ఈ ఉద్యోగులను నియమించి రూ.150 ప్రారంభ వేతనంతో 623, 1623, 4000 వరకు పెంచింది. అయితే తాము చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఈ వేతనంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆ ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 58 మంది పార్ట్ టైం ఆఫ్ ఫారస్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలో 18 మంది, మండల పరిషత్ పాఠశాలలో 40 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ముగ్గురికి రూ.13,000 వేతనం, 55 మందికి రూ.4000 వేతనం అందిస్తున్నారు. వేతనం పెంచుతూ జీవో జారీ చేసిన రూ.5200 ప్రభుత్వం అందించలేక పోతోంది. జిల్లావ్యాప్తంగా 14 నెలల నుంచి రూ.4వేల వేతనం ఇవ్వలేకపోతున్నారని ఆ ఉద్యోగులు చెబుతున్నారు. గత ఆరు నెలల క్రితం ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా.. జిల్లా పరిషత్ సీఈవో మూడు నెలల వేతనం చెల్లిస్తామని కలెక్టర్ సాక్షిగా చెప్పి, ఇప్పటివరకు చిల్లిగవ్వ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోర్టులో కేసు వేసినా ఖర్చు భరించలేక.. ప్రభుత్వంపై కొట్లాడలేక రూ.4 వేలకు పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రామిక దోపిడీ ఆగాలని, పనికి తగిన వేతనాన్ని అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

శ్రమను గుర్తించడం లేదు



ప్రభుత్వాలు ఎన్ని మారినా.. మా శ్రమను గుర్తించటం లేదు. ఈ ప్రభుత్వమైనా మా శ్రమను గుర్తించి, శ్రమకు తగిన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి. పెండింగ్‌లో ఉన్న పూర్తి వేతనాలను ఉద్యోగులకు ఏకకాలంలో చెల్లించాలి.

- శివలింగం, ఉద్యోగి

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ప్రభుత్వం పిటిఎఫ్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. ఉద్యోగ భద్రత కల్పించి, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలి. 30, 40 సంవత్సరాల నుంచి తాము పనిచేస్తున్నా.. ప్రభుత్వాలు స్పందించటం లేదు. వెంటనే ప్రభుత్వం స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి.

- నారాయణ, పిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

ఓటు వినియోగంలో మహిళల చైతన్యం



నవతెలంగాణ-బోధన్

ఎన్నికలేవైనా.. ఓటు హక్కును వినియోగించుకోవడంలో బోధన్ నియోజకవర్గంలో మహిళలదే పైచేయిగా ఉంటున్నారు. ప్రతి ఎన్నికలలో మహిళలు వారి ఓటు హక్కు వినియోగించడానికి స్వచ్ఛందంగా తరలివస్తున్నారు. దాంతో సంఖ్యాబలంలో ఓటు హక్కు వినియోగించుకోవడంలో మహిళలే ముందుంటున్నారు. గత నాలుగు రోజుల క్రితం జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో మహిళల సంఖ్య బలం అధికంగా కనిపిస్తుంది.

బోధన్ నియోజకవర్గంలో 2,23,096 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,06,377 మంది పురుష ఓటర్లు ఉన్నారు. 1,16,719 మంది మహిళ ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 78,736 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే 87,494 మంది మహిళలు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ లెక్కన చూస్తే పురుషులకంటే మహిళలే ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఆధిక్యంలో ఉన్నారు. బోధన్ నియోజకవర్గంలో మొత్తం 1,66,330 మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తానికి బోధన్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల్లో 74.56 శాతం ఓటు శాతం నమోదయింది. సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో కంటే పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ శాతం మామూలుగా ఉంటుంది. కానీ ఈసారి ఓటింగ్ శాతం జరిగింది. లోక్‌సభ ఎన్నికల్లో మహిళలు అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

జూన్‌లో లోక్‌సభ ఫలితాలు..

ఎంతో రసవత్తరంగా కొనసాగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు జూన్ 4న తేలనున్నాయి. దాంతో అభ్యర్థులు నియోజకవర్గాల వారీగా ఓట్ల సరళిని వారి పార్టీ కార్యకర్తలు, నాయకుల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ లెక్కలు వేసుకుంటున్నారు. ఏ నియోజకవర్గంలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయని, ఓట్లు రాకపోవడానికి గల కారణాలను విశ్లేషించుకుంటూ బిజీగా మారారు. గత శాసనసభ ఎన్నికలలో పోటీచేసి ఓడిపోయిన బాజిరెడ్డి గోవర్ధన్ లోక్‌సభ ఎన్నికలలో ఎంపీగా పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్ అధిష్టానం ఆయనను ఎంపీగా మరో అవకాశం ఇవ్వడంతో ఆయన ఎన్నికలలో తలపడ్డారు. దాంతో ఈ ఎన్నికలలో ఆయన విజయం సాధిస్తారని పార్టీ శ్రేణులు ఆశలు పెట్టుకున్నారు. అలాగే కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పోటీలో నిలిచారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే.. ఆరు గ్యారెంటీల్లో కొన్నింటిని అమలు చేసిన విషయం తెలిసిందే. దాంతోనే కాంగ్రెస్ నాయకులు గెలుపు ధీమాతో ఉన్నారు. ఇక మాజీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఎంపిగా విజయం సాధించి గడిచిన ఐదేళ్ల కాలంలో జిల్లాను అభివృద్ధి చేయడంలో వెనుకబడ్డారని ముద్ర ఉంది. జిల్లాకు పసుపు బోర్డు తెస్తానని హామీ ఇచ్చిన ఆయన సుగంధ ద్రవ్యాల బోర్డును తీసుకువచ్చి రైతులను అయోమయానికి గురిచేసినట్లు విమర్శలు తలెత్తాయి. అలాగే ఎంపీ నిధుల ద్వారా జిల్లాలో ఆయన చెప్పుకోదగ్గ స్థాయిలో అభివృద్ధి పనులు చేయలేదని సర్వత్రా విమర్శలున్నాయి. దాంతో ఆయన గెలుపు నల్లేరుపైనడకగా పలువురు భావిస్తున్నారు. ఏదిఏమైనా ఓటర్ల తీర్పుపై అభ్యర్థుల భవిష్యత్తు జూన్ 4న తేలే అవకాశం ఉండడంతో సర్వత్రా ఉత్కంఠగా ఫలితాలకై ఎదురు చూస్తున్నారు.

చిక్కడు.. దొరకడు..

- నా ఆఫీసు నా ఇష్టం
- సమయపాలన పాటించని బిచ్కుంద ఆర్ఐ
- ఇతర సిబ్బందీ అదే తీరు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



అధికారులు లేకపోవడంతో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

నవతెలంగాణ-బిచ్కుంద

ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సమయపాలన పాటించకుండా అధికారులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలకు.. తహసీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం వరకు వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఆర్ఐ రాక కోసం ఎదురుచూశారు. సమయపాలన పాటించడం లేదని ప్రజలు నిలదీస్తే నా ఆఫీసు నా ఇష్టం అంటూ ప్రజలకు దురుసుగా ప్రవర్తించారని ఆయన తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డ్ అసిస్టెంట్లతో పాటు కింది స్థాయి సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ప్రజలు ఉదయం 10 గంటల నుంచి ఎదురు చూసి అధికారులు రాకపోవడంతో తహసీల్దార్ సురేష్‌కు ఫోన్ చేయగా ఎన్నికల విధుల్లో ఉన్నానని సమాధానం ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయానికి ఆర్ఐ మధ్యాహ్నం 12 గంటల తర్వాత రావడంతో వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు ఆయన కోసం అప్పటివరకు ఎదురు చూశారు. అక్రమ ఇసుక, మొరం ట్రాక్టర్ల ద్వారా కొనసాగుతున్న రవాణా వాటి వసూళ్లపై ఉన్న శ్రద్ధ విధి నిర్వహణలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చూపడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బిచ్కుంద తహసీల్దార్ కార్యాలయంలో వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం చేసుకున్న దరఖాస్తులు 250 వరకు పెండింగ్లో ఉన్నాయి. పెట్టుకున్న దరఖాస్తుల కోసం పరిష్కరించాలని ప్రజలు నెలరోజుల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్న అధికారులు చిక్కితే దొరకరు.. దొరికితే చిక్కరు అనే రీతిలో కొనసాగుతున్నారు. ప్రతిరోజు ప్రజల సమస్యల పరిష్కారం కోసం చేసుకున్న దరఖాస్తులు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దరఖాస్తుల పరిశీలన విచారణ పేరుతో నెలల తరబడి కాలయాపన చేయడంతో దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోవడం లేదు. పై అధికారులు కూడా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంతో రెవెన్యూ అధికారులపై ఉన్న నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.

చేతులు తడిపితేనే పనులు..

అడంగల్, పాత పహాని రికార్డులు ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజలు సిబ్బంది చేతులు తడుపుతేనే రికార్డులు ఇతర పత్రాలు అందే పరిస్థితి నెలకొంది. తహసీల్దార్ కార్యాలయంలో పనులు కాకపోవడంతో ప్రజాప్రతినిధులకు విన్నవించిన వారు ఎన్నికల్లో బిజీగా ఉండడంతో అధికారులకు అడిగేవారు లేరనే నమ్మకంతో ప్రజలకు ఇబ్బందులకు గురిచేసి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటితోపాటు అనుమతి లేకుండా ఇసుక, మొరం రవాణా చేస్తున్న ట్రాక్టర్ల యజమానుల నుంచి అక్రమ వసూళ్ల కోసం ప్రైవేటు వ్యక్తులను అధికారులు నియమించినట్లు ఆరోపణలు లేకపోలేదు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి బిచ్కుంద తహసీల్దార్ కార్యాలయంపై ప్రత్యేక దృష్టి సారించి అధికారులు సమయపాలన పాటించే విధంగాచూడాలని, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోని పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయ స్థాయిలో 17వ ర్యాంక్



నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన వైష్ణవి జాతీయ స్థాయిలో 17వ ర్యాంక్ సాధించింది. ఎన్‌టిఏ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయస్థాయిలో ఏప్రిల్ 13వ తేదీన పరీక్ష రాయగా.. ఆ పరీక్షలో 17వ ర్యాంక్ సాధించిందని కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యార్థి తన జీవితంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని పలువురు ఆకాంక్షించారు.

విధులకు గైర్హాజరైన ప్రభుత్వ ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీస్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం శివరామిరెడ్డిపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న శ్రీరంగం సుహాసిని ఐదు సంవత్సరాలకుపైగా విదేశాల్లో ఉంటున్నందున ఆమెకు షోకాజ్ నోటీసులను అందించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. సుహాసిని 15.09.2018 నుంచి 14.09.2021 వరకు, 15.09.2021 నుంచి 14.07.2023 వరకు యూఎస్ఏను సందర్శించడానికి అనుమతించబడిన సమయం కంటే 14.07.2023 సెలవు పొడిగింపు దరఖాస్తును తిరస్కరించిన తర్వాత, 15.07.2023 నుంచి సెలవు మంజూరు చేయకుండా అనాధికారికంగా విధులకు గైర్హాజరైన తర్వాత డ్యూటీకి నివేదించబడలేదని, ఇందువల్ల ఆ పాఠశాలల విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. సిసిఏ నియమాలు 1991 నియమం (20) ప్రకారం ఆమెపై అభియోగాల ఆర్టికల్ రూపొందించబడిందని తెలిపారు. విచారణ అధికారి వ్యక్తి విచారణ అధికారి ముందు హాజరు కాలేదని విచారణకు స్పందనలేదని, అనుమతి లేకుండా యుఎస్ఏలో ఉంటున్నారని పేర్కొంటూ విచారణ అధికారి నివేదికను సమర్పించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమెకు షోకాజ్ నోటీసు అందించినట్టు పేర్కొన్నారు.

'లైంగిక వేధింపులపై' విచారణ



డీఎంఅండ్‌హెచ్‌వోను విచారణ చేస్తున్న ఉన్నతాధికారి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మణ్‌సింగ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ నాయక్ మహిళ వైద్య ఉద్యోగులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ గత కొద్ది రోజుల క్రితం మహిళ వైద్య ఉద్యోగులు జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్పీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై పలు మండలాల్లో వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ, సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సైతం మహిళ వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కాగా బుధవారం రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ అధికారి అమర్‌సింగ్ నాయక్ జిల్లా కేంద్రంలోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఈ విషయమై విచారణ చేపట్టారు. అయితే లైంగిక వేధింపులకు గురైన బాధితులను విచారణ చేపట్టగా.. లైంగిక వేధింపులు నిజమేనని బాధితులు అధికారుల ముందర గోడు వెళ్లబోసుకున్నారు. ఏ విధంగా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారో ఆ బాధితులు అధికారులకు వివరించారు. విచారణ అనంతరం అధికారులు మాట్లాడుతూ.. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా.. వేధింపులకు పాల్పడుతున్న డిఎంఅండ్‌హెచ్‌ఓ, సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని మహిళ వైద్యులు, ఉద్యోగులు భీష్మించుకూర్చున్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ముందు మహిళా ఉద్యోగులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. దీంతో డిఎంహెచ్‌ఓ లక్ష్మణ్‌సింగ్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ అధికారిని ఎమ్మెల్యే కోరారు. మహిళా ఉద్యోగుల పట్ల ప్రవర్తించిన ఆ ఇద్దరు ఉద్యోగులను విధుల నుంచి తొలగించాలని అన్నారు. ఏడురోజుల్లో వారిపై చర్యలు లేకుంటే తాను ధర్నా చేపడతానని ఈ సందర్భంగా రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ అధికారి అమర్ సింగ్ నాయక్‌తో అన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి

మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో జిల్లాలో ఉన్న మహిళ ఉద్యోగులు వేధింపులు భరించలేక రాష్ట్ర ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకుండా మహిళా ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని దర్యాప్తు జరిపి సంబంధించిన అధికారులపై చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. వారిని సస్పెండ్ చేయాలని, లేకుంటే ఈ ఘటనపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

సీతారామాంజనేయ ఆలయంలో అన్నదానం


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని శ్రీ సీతా రామాంజనేయ ప్రతిష్టాపన చేసి 41వ రోజులు అవుతున్న సందర్భంగా మండల పూజ, అన్నదాన కార్యక్రమం బుధవారం ఆలయ కమిటి అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు, పల్లకీ సేవ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, గ్రామ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పరిశీలన


అమ్మ ఆదర్శ పాఠశాలను పరిశీలించిన్న ఏఈ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని ఎంపికైన 12 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను ఏఈ నాగేశ్వర్ రావ్ బుధవారం పరిశీలించారు. ఇందులోభాగంగా బట్టాపూర్ గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాలను సందర్శించి మాట్లాడారు. రాబోయే విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే మిగిలివున్న పనులను నాణ్యత లోపం లేకుండా పూర్తిచేయించాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏపీఎం శ్యామ్,హెచ్.ఎం శేర్ల శ్రీనివాస్,సీసీ సంతోష్,కట్కం సాగర్,మహిళ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కల్లాలు లేక ఉపాధి కరువు

- పదివేల కుటుంబాలకు నష్టం
- టెండర్లు పిలిచినా ముందుకు రాని కాంట్రాక్టర్లు

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామీణ మారుమూల ప్రాంత ప్రజలు కాయ కష్టం చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు, మరికొందరు దినసరి కూలీలుగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువ శాతం ఎండాకాలంలో పనులు లేక ప్రత్యామ్నాయ పనుల వైపు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగానే ప్రతి ఏటా తునికి ఆకు కల్లాలు ఏర్పాటు చేయడంతో వేల కుటుంబాలు ఉపాధితో కుటుంబ పోషణ జరిగేది. ఎండాకాలంలో ఈ సంవత్సరం జిల్లాలో తునికాక సేకరణ కోసం అటవీ శాఖ అధికారులు టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో తునికాకు కల్లాలు ఏర్పాటు చేయలేకపోయారు. దీంతో పేద కుటుంబాలకు ఉపాధి కరువైంది కోల్పోయారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా దట్టమైన అటవీ ప్రాంతాలు ఉన్నాయి. జిల్లాలో ఎల్లారెడ్డి రేంజ్, కామారెడ్డి రేంజ్, బాన్సువాడ రేంజ్, మాచారెడ్డి రేంజ్, నాగిరెడ్డిపేట్ రేంజ్‌ల పరిధిలో దట్టమైన అటవీ ప్రాంతాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా అటవీ విస్తీర్ణం 98 వేల హెక్టారు ఉంది.అటవీ ప్రభావిత గ్రామాలు జిల్లాలో అధికంగా ఉన్నాయి. ప్రతి సంవత్సరం జనవరి, ఫిబ్రవరి మాసంలో రాష్ట్ర అటవీశాఖ ఆదేశానుసారం జిల్లా అటవి శాఖ అధికారులు తునికాకు సేకరణ కోసం టెండర్లను సిద్ధం చేశారు. ఈ సంవత్సరం కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో తునికాకు కల్లాలు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామీణ ప్రాంతవాసులు ఉపాధి కోల్పోయారు. కుటుంబ పోషణ భారంగా మారింది.


తునికాకు కోసం ఏర్పాటుచేఇసన కల్లాలు (ఫైల్)

ఉపాధి కోల్పోయిన 10 వేల కుటుంబాలు

తునికి ఆకు కల్లాలు లేకపోవడంతో గ్రామీణ ప్రాంత పేద ప్రజలు 10వేల కుటుంబాలపైగా ఈ సంవత్సరం ఉపాధి కోల్పోయారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ మే మాసంలో ప్రతి కుటుంబం ఉదయం సాయంత్రం పిల్ల జల్ల కలిసి ఉదయం 6 గంటలకు అడవి బాట పట్టేవారు. ఆకు సేకరించి 10 గంటలకు ఇంటికి వచ్చేవారు. 100 ఆకులతో కట్టను కడితే దానికి అటవీ శాఖ వారు ఒక్క రూపాయి 75 పైసలు చెల్లించేవారు. ఈ లెక్కన ఒక్కొక్క కుటుంబంలో రోజు 300 నుండి 500 పైగా ఆకు సేకరించి కట్టలు కట్టేవారు. ఒక్కొక్క కుటుంబం రెండు నెలల వ్యవధిలో 25వేల నుంచి 35 వేల తునికి ఆకు సేకరించడంతో వచ్చేవి. దీంతో కుటుంబ పోషణ జరిగేది. అప్పులు సైతం కట్టేవారు. ప్రస్తుతం ఒకవైపు ఎండలు తీవ్రం కావడం మరోవైపు పొలంపనులు లేకపోవడంతో ఇండ్లకే పరిమితమయ్యారు. జిల్లాలోని లింగంపేట్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, గాంధారి, మాచారెడ్డి, రామారెడ్డి, బాన్సువాడ, నిజాంసాగర్, పిట్లం, పెద్ద కొడప్‌గల్, రాజంపేటం తాడ్వాయి మండలాల్లో పదివేల పైగా కుటుంబాలు తునికాకు కల్లాలు లేకపోవడంతో ఉపాధి ఉపాధి కోల్పోయారు. ఇదే ఆసరాగా తీసుకున్న కొందరు కార్ఖానా నిర్వాకులు కూలీలను పెట్టి ఆకు సేకరిస్తున్నారని నిల్వ ఉంచుకుంటున్నారని గ్రామీణ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు.

కల్లాలు లేక ఉపాధి కరువు

అటవీ శాఖ అధికారులు ప్రతి సంవత్సరం గ్రామీణ ప్రాంతాల్లో మార్చి నెలాఖరిలోగా తునికాకు కల్లాలు ఏర్పాటు చేసేవారు ఏప్రిల్, మే నెలలో తునికి ఆకు గ్రామీణ ప్రాంత వాసులు నుండి కొనుగోలు చేసేవారు. ఈ సంవత్సరం తునికాకు కల్లాలు ఏర్పాటు చేయకపోవడంతో నిరుపేద కుటుంబాలు, దినసరి కూలీలకు ఉపాధి కరువైంది. తునికాకు సేకరణకు ఉదయం 6 గంటలకు కుటుంబ సభ్యులు పిల్ల జల్లా ముసలివారు సైతం సమీపంలో అటవీ ప్రాంతానికి వెళ్లి 10 గంటల వరకు తునికాకు సేకరించి తిరిగి ఇంటికి వచ్చేవారు. అనంతరం కొంతమంది దినసరి కూలికి వెళ్లేవారు మిగతా వారు సేకరించిన తునికాకును కట్టలు కట్టి సమీపంలోని కల్లాల వద్దకు తీసుకెళ్లేవారు. దీంతో వేలాది కుటుంబాలలకు తునికాకు సేకరణతో ఉపాధి లభించేది. గత సంవత్సరం జిల్లాలో ఎల్లారెడ్డి రేంజ్ పరిధిలో వెల్లుట్ల, తిమ్మారెడ్డి యూనిట్ పరిధిలో టెండర్ వేసి తునికాకు సేకరించారు. ప్రస్తుతం అది కూడా లేకుండా పోయింది. టెండర్లు వేయకపోవడంతో అటవీ ప్రాంతంలోకి కొందరు గ్రామీణ ప్రాంత వాసులు వెళ్లి తునికాకు సేకరిస్తున్నారు. ఇందులో ముఖ్యంగా లింగంపేట్, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి, రామారెడ్డి, మాచారెడ్డి, గాంధారి, బాన్సువాడ మండలాల పరిధిలోని గ్రామీణ ప్రాంత వాసులు తునికి సేకరిస్తూ కల్లాలు లేకపోవడంతో తమ ఇండ్ల వద్ద ఆరబెట్టుకుంటున్నారు.

కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు

గోపాలరావు, జిల్లా అటవీ శాఖ అధికారి

జిల్లావ్యాప్తంగా ఈ సంవత్సరం జనవరి, ఫిబ్రవరి మాసంలో టెండర్లకు పిలిచాం, టెండర్లకు కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రాలేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో తునికి ఆకు కల్లాలు ఏర్పాటు చేయలేకపోయాం. గ్రామీణ ప్రాంత వాసులు ఆకు సేకరణపై ఆసక్తి చూపేవారు.

ఎండిన ఆకును కొన్ని రోజుల తర్వాత పట్టణ ప్రాంతాలకు వెళ్లి రెండు రూపాయలకు ఒక కట్ట చొప్పున విక్రయించుకుంటామని, వచ్చిన డబ్బులతో సరుకులు తీసుకుంటామని గ్రామీణ ప్రాంత వాసులు అంటున్నారు.


తునికాకు సేకరించిన గ్రామీణులు (ఫైల్)

అవమాన భారంతో మెప్మా మహిళా ఆర్పి రాజీనామా


మున్సిపల్ కమిషనర్ కు రాజీనామా పత్రాన్ని అందజేత్త

నవతెలంగాణ-ఆర్మూర్

ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మాటలకు మనస్థాపానికి గురై మహిళ ఉద్యోగి బుధవారం ఆమె ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ రాజుకు రాజీనామా పత్రాన్ని అందజేసింది. పట్టణంలో మొన్న జరిగిన లోక్సభ ఎన్నికలలో మెప్మా ఆర్పిలకు వాలంటీర్లుగా పెట్టారు. ఇందులో భాగంగా బిజెపికి చెందిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఎన్నికల బూత్‌లు తిరుగుతూ డ్యూటీలో ఉన్న మహిళ ఉద్యోగి అయిన మెప్మా ఆర్పిని ఇష్టానుసారంగా బెదిరిస్తూ ఇక్కడి నుండి బయటికి వెళ్ళు గెట్ అవుట్ అని ఆమెను ఆ బూత్‌నుండి బయటకు పంపించి వేశారు. ఆమె ఏం చెప్పినా వినిపించుకోకుండా గట్టిగా బెదిరిస్తూ పంపించారు. ఆమె మనస్థాపానికి గురై అక్కడి నుండి ఏడుస్తూ వెళ్లి పోయారు. ఆమె సార్ మాకు మున్సిపల్ కమిషనర్ గారు డ్యూటీ వేశారు అని ఎంత చెప్పినా వినకుండా మీ ఆర్పి లకు ఇక్కడ ఏం పని? ఎందుకు వచ్చారు? అని ఆమెను అందరి ముందు అవమానించాడు. ఎమ్మెల్యే మాటలకు మనస్థాపానికి గురైన మహిళా ఉద్యోగి తాను చేస్తున్న ఆర్పి ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఎవరి భర్తలైనా రాజకీయాల్లో ఉంటే వారి భార్యలు జాబులు చేయకూడదా ?రాజకీయాల్లో ఉన్న వ్యక్తుల భార్యలు జాబులు చేయడం? లేదా అని ప్రశ్నించారు. భర్తలు రాజకీయాల్లో ఉంటే వారి భార్యలను ఎమ్మెల్యే ఇలాగే అవమానిస్తారా.. అని అడిగారు? న్యాయం కోసం ధర్మం కోసం పనిచేస్తానని చెప్పిన ఎమ్మెల్యే ఆడవారితో మాత్రం ఎలా మాట్లాడాలో తెలియదా అని అన్నారు. ఒక ఎమ్మెల్యే హెూదాలో ఉండి అందరిని సమానంగా చూడాలని, ఇలా కించపరిచేలా ప్రవర్తించకూడదని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా తన రాజీనామాకు మాత్రం ఎమ్మెల్యే కారణం అని ఆమె అన్నారు.

కమ్మర్‌పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన గ్రామ అభివృద్ధి కమిటీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్ పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని అన్ని కుల సంఘాల నుండి ఒక్కో సభ్యుడిని గ్రామ అభివృద్ధి కమిటీకి పంపించగా అందులో నుండి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ నూతన అధ్యక్షులుగా భోగ రామస్వామి, ఉపాధ్యక్షులుగా శివసాలం గణేష్, కోశాధికారిగా నూకల బుచ్చి మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా జైడి బాలకృష్ణ, సలహాదారులుగా కండక్టర్ రవీందర్, దూలూరి కిషన్ గౌడ్, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులను ఇతర సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి తమ వంతుగా పాటుపడతామన్నారు. గ్రామ సమస్యల పరిష్కారంలో ఎలాంటి వివక్షకు తావు లేకుండా అన్ని పార్టీలను కలుపుకొని ముందుకు పోతామన్నారు. కార్యక్రమంలో సున్నం మోహన్, బద్దం రాజేష్, కొత్తపల్లి గణేష్, అంకోజి అంకిత్, భూమేశ్వర్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

17నుండి బ్యాక్ లాక్ పరీక్షలు

నవతెలంగాణ - నిజామాబాద్ సిటీ

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటలో 2017 వ సంవత్సరానికి ముందు (ఓల్డ్ బ్యాచ్) డిగ్రీలో చేరి బ్యాక్ లాక్ పరీక్ష ఫీజు కట్టిన విద్యార్థులకు (ప్రథమ, తృతీయ సంవత్సర పరీక్షలు ఈ నెల 17 నుండి జరుగనున్నాయని తెలిపారు. విద్యార్థులు వారి హాల్‌టికెట్‌ను ఆన్‌లైన్ నుండి డౌన్లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తోపాటు ఐడి ప్రూఫ్, ఎగ్జామ్ పాడ్‌ను తప్పకుండా తీసుకొని రావాలని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాంమోహన్ రెడ్డి, అధ్యయన కేంద్ర రీజినల్ కో ఆర్డినేటర్ కె.రంజిత్ ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారనికి ఈ ఫోన్ నెంబర్ 738 2929612 కు సంప్రదించాలని పేర్కొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ


తనిఖీ చేస్తున్న పోలీస్ శాఖ అధికారులు

నవతెలంగాణ -బాల్కొండ

మండల పరిధిలోని వన్నెల్ బి, బోదేపల్లి గ్రామాల రహదారిపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన పలువురిపై కేసు నమోదు చేశారు. వాహన పత్రాలు లేకుండా వాహనం నడిపిన వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సరైన వాహన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీలో హెడ్ కానిస్టేబుల్ జయవంతరావు, కానిస్టేబుల్ ప్రశాంత్, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లలో

ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలే?

- పదవి నుండి దిగిపోతున్నం
- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిటిసిల ఆవేదన
- మిషన్ భగీరథ లీకేజీలను సరి చేయండి
- మండల సమావేశానికి రాని అధికారులపై చర్యలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



నాలుగున్నర ఏళ్లలో ప్రతి సారి నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయా గ్రామాల్లోని సమస్యలను ప్రతిసారి చెప్పినప్పటికీ ఏ ఒక్క సమస్య పరిష్కారంలేదని, తమ పదవీకాలం అయిపోతుందని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాల్లో మిషన్ భగీరథ పైపు లీకేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు తాగునీరందించాలని ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇన్చార్జి ఎంపీపీ ఎంపీపీ నర్సయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశం లో ఈమ్మతాపూర్ ఎంపీటీసీ ఒడ్డె సాయిలు, సాంపల్లి ఎంపీటీసీ బిక్యానాయక్ మాట్లాడుతూ.. గ్రామాల్లో మిషన్ భగీరథ లీకేజీలు ఎక్కువగా ఉన్నాయని, దీంతో తాగునీరు సరిగ్గా అందడం లేదని ఆరోపించారు. అమృతాపూర్లో ట్యాంకులకు కనెక్షన్లు ఇచ్చారే తప్ప కొత్తగా మిషన్ భగీరథ నల్లాల ద్వారా నీరందించడం లేదన్నారు. ప్రతిసారి అనేక సమస్యలు దృష్టికి తెచ్చినప్పటికీ ఏ ఒక్క సమస్య పరిష్కారం కాకుండానే తాము పదవి నుండి దిగిపోవాల్సి వస్తుందని ఎంపిటిసిలు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రత్యేక దృష్టి పెట్టి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. వానకాలం సీజన్ ప్రారంభమైన దృష్ట్యా ఇప్పటికీ జీలుగ విత్తనాలు అందుబాటులో లేవని, సీజన్ ముగిసిన తర్వాత విత్తనాలు ఏమి అవసరమని, తక్షణమే జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. ఎన్నికల కోడ్ మూలంగా జీలుగ విత్తనాలు సరఫరా కాలేదని, త్వరలోనే జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంచుతామని ఏఈఓ భావన సభ దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో ఆంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడం లేదని సభ్యులు సభ దృష్టికి తేగా అంగన్వాడీ సూపర్వైజర్ స్పందిస్తూ పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నానని బదులిచ్చారు. ఎంపీడీఓ రవీందర్ కల్పించుకుని మాట్లాడుతూ తాను ఏ గ్రామంకు వెళ్లిన అంగన్వాడీ కేంద్రాలను తరచూ తనిఖీ చేస్తున్నామని, అక్కడ పిల్లలకు నాణ్యమైన ఫుడ్ అందడం లేదన్నారు. ఇక నుంచి క్షేత్రస్థాయిలోని అంగన్వాడీ కేంద్రాలను సూపర్వైజర్లు తనిఖీలు చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఎంపీడీఓ సూచించారు. మూడు నెలలకోకసారి జరిగే సర్వసభ్య సమావేశాలకు హాజరు కానీ మండల, డివిజన్ స్థాయి అధికారులపై జిల్లా కలెక్టర్కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీటీసీ దాసరి ఇందిరా లక్ష్మీనర్సయ్య. ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ శ్రీనివాస్ గౌడ్, ఎంఈఓ రాజగంగారాం, గురుకుల విద్యాలయ జిల్లా కోఆర్డినేటర్ సంగీత, అంగన్వాడీ సూపర్వైజర్లు, స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


పాల్గొన్న సభ్యులు

ఇఫ్కో జాతీయ డైరక్టర్‌కు సన్మానం


ఇఫ్కో జాతీయ డైరక్టర్‌కు సన్మానం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో బుధవారం జరిగిన పాలక వర్గ సమావేశంలో బ్యాంకు డైరెక్టర్ గా, రాష్ట్ర మార్క్ ఫేడ్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న మార గంగారెడ్డి ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఎరువుల కంపెనీ అయినా ఇఫ్కో (ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కోపరేటివ్ లిమిటెడ్) కు జాతీయ డైరెక్టర్ పదవి దక్కినందున ఎన్డిసిసిబి బ్యాంకు చైర్మన్ కుంట రమేష్ రెడ్డి ఘనంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంకు డైరక్టర్లు, ముఖ్య కార్య నిర్వహణ అధికారి నాగభూషణం వందే, బ్యాంకు జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

రిటైర్డ్ స్థానంలో పోస్టులను భర్తీ చేయాలి : సీపీఐ



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వివిధ శాఖల్లో పనిచేస్తున్న వెయ్యి మంది రిటైర్డ్ అయిన వారి స్థానంలో పోస్టులను భర్తీ చేయాలి అని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో బుధవారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగులు రిటర్మెంట్ అయిన తర్వాత కూడా సుమారు 1000 మంది విశ్రాంత ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. వారిని తొలగించి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారితో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ప్రెస్ మీట్‌లో సిపిఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య, కె రాజన్న, బి రఘురాం, పి. రంజిత్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- ఎంపీపీ పస్కనర్సయ్య
- సాదాసీదాగా సాగిన మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రజా సంక్షేమ పథకాలు పలు అభివృద్ధి పనులను ఎన్నికల కోడ్ ముగియగానే ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీపీ పస్కా నర్సయ్య అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో వారు సమావేశంలో లేకపోవడంతో సమావేశం సాదాసీదాగా జరిగింది. మండలంలోని గోవింద్‌పేట్ అంకాపూర్ గ్రామాల ఎంపీటీసీలు యల రాజ్ కుమార్, ఎంసి గంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైస్ మిల్లర్లు వరి ధాన్యం బస్తాల్లో కడతా తీస్తున్నారని, అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. తహసిల్దార్ గజానను మాట్లాడుతూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు . ఉపాధి హామీ ఎపిఎం సురేష్ మాట్లాడుతూ.. రాబోయే హరితహారం కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు ప్రణాళిక బద్ధగా కృషి చేస్తామని అన్నారు. ఐసిడిఎస్ పిప్రి సెక్టార్ సూపర్వైజర్ వెంకట రమణమ్మ మాట్లాడుతూ మండలంలో 58 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయి. ఇందులో మూడు టీచరు, మూడు ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అంగన్వాడి కేంద్రాల ద్వారా ఆరోగ్యలక్ష్మి భోజనం అందజేస్తున్నామని. మూడు సంవత్సరాల్లోపు పిల్లలకు టీ హెచ్ ఆర్ ద్వారా బాలామృతం గుడ్లు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిరాం, జడ్పిటిసి మెట్టు సంతోష్, ఐకెపి ఎపిఎం గంగారం, హార్టికల్చర్ అధికారి సుమన్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మి, పిప్రి, పతేపూర్, దేగాం, ఆలూర్ తదితర గ్రామాల ఎంపీటీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ పస్క నర్సయ్య

రూ.1000 ఫైన్‌తో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్ సప్లమెంటరీ పరీక్షకు హాజరు కావడానికి వెయ్యి రూపాయల అపరాధ రుసుంతో ఈనెల 16వరకు చెల్లించే అవకాశం ఇంటర్ బోర్డు కల్పించిందని జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ బస్సుల్లో మహిళ ప్రయాణికుల సందడి

నవతెలంగాణ-రెంజల్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించడంతో బస్సులలో మహిళా ప్రయాణికులతో సందడి నెలకొంటుంది. బుధవారం రెంజల్ మండలం సాటాపూర్ చౌరస్తాలో తాడ్‌బిలోలి బస్సు రావడంతో బస్సు కోసం నిరీక్షిస్తున్న మహిళలు పోటీ పడుతూ బస్సు ఎక్కడానికి ప్రయత్నం చేస్తున్నారు. వారిలో ఒక్కరు మాత్రమే పురుషుడు మిగతా వారందరూ మహిళలే బస్సులో ప్రయాణించడానికి ముందుకు రావడం విశేషం


బస్సులో ఎక్కేందుకు గుమిగూడిన మహిళలు

పూసిన మే పుష్పం

నవతెలంగాణ-బోధన్

మే నెలలో మాత్రమే ప్రత్యేకంగా పూసే పుష్పం ఇది. బోధన్ పట్టణంలోని నాగభూషణం అనే వ్యక్తి ఇంట్లో మే పుష్పం వికసించింది. అలాగే పలుచోట్ల ఆరుద్ర పురుగులు దర్శనమిచ్చాయి. దాంతో ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశాలున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వికసించిన మే పుష్పం

దొరికింది తినేద్దాం..

- పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువలో బాతులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఆకలితో ఉన్న జీవికి ఆహారం దొరికితే ఆ ఆనందం వేరే ఉంటుంది. అదేవిధంగా వరంగల్ నుంచి నాగిరెడ్డిపేట్ మండలం మీదుగా వలస వెళ్తున్న బాతులకు అదే కనిపించింది. ఉన్నట్టుండి బురద నీరు కనబడడంతో ఆ బురదలో తమకు కావాల్సిన ఆహారాన్ని వెతకడంలో బిజీ అయిపోయాయి ఆ బాతులు. వరంగల్ నుంచి నాగిరెడ్డిపేట్ మీదుగా వెళ్తున్న వలస బాతులకు పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ అయిన గోలిలింగాల్, చీనూరు గ్రామాలను ఆనుకొని పారుతున్న పోచారం ప్రధాన కాలువ కనిపించడంతో ఆ కాలువలో గల బురద నీటిలో చిన్న చిన్న చేపలు, పురుగులు, దొరుకుతాయని బాతులు తిండి వేట కొనసాగించాయి. వందలాది బాతులు ఆ బురదలో వేటాడుతుంటే పాదాచారులు అదృశ్యాన్ని తిలకిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఆ దృశ్యాన్ని నవతెలంగాణ బుధవారం క్లిక్ మనిపించింది.



బురద నీటిలో ఆహారాన్ని వెతుకుతున్న బాతులు

కనువిందు చేస్తున్న ఎరుపురంగు పూలు


విరబూసిన ఎరుపురంగు పూలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని ప్రధాన రహదారి అయిన సాటాపూర్ చౌరస్తా నుంచి కందకుర్తి వరకు రోడ్డు ఇరుపక్కల నాటిన మొక్కలకు విరబూసిన ఎరుపు రంగు పూలు ప్రయాణికులను ఆకర్షిస్తున్నాయి. హరితహారంలో భాగంగా నాటిన ఈ మొక్కలు ఏపుగా ఎదిగాయి. వాటికి విరబూసిన ఎరుపు రంగు పూలు ఎంతో ఆకర్షిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు వాటిని చూస్తూ ఆనందంతో రహదారి వెంట ప్రయాణిస్తున్నారు.

బాలబాలికలకు నాణ్యమైన విద్యబోధన అందించడమే లక్ష్యం

- అంగన్వాడీ ఉపాధ్యాయురాలు శారద


విద్యబోధన చేపడుతున్న అంగన్‌వాడీ టీచర్

నవతెలంగాణ-ఎడపల్లి

అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారి బాలబాలికలకు నాణ్యమైన విద్య బోధన అందించడమే తమ లక్ష్యమని అంగన్వాడీ ఉపాధ్యాయురాలు శారద అన్నారు. బుధవారం నవతెలంగాణతో ఆమె మాట్లాడారు. బాలబాలికలకు ఆటపాటలతో పాటు విద్య బోధన చేపడుతున్నట్టు వివరించారు. బాలబాలికలకు పౌష్టికారాన్ని క్రమంగా అందిస్తున్నామన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన మహిళా గర్భిణులకు వంట చేసి పెడుతున్నామని, సమయపాలన పాటిస్తూ అంకితభావంతో పనిచేస్తూ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ప్రమాదకరంగా ముత్యంపేట రోడ్డు

- సమస్యను పరిష్కరించేనా..?

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని ముత్యంపేట రోడ్డు ప్రాంతంలో గత ఆరు రోజుల క్రితం ఈదురుగాలులు వీచడంతో రోడ్డు పక్కన ఉన్న చెట్టు విరిగి విద్యుత్తు వైర్లపై పడి ప్రమాదకరంగా మారింది. సంబంధిత శాఖ అధికారులు మాత్రం సమస్యను పరిష్కరించడం లేదని ఆయా గ్రామాల ప్రయాణికులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు దోమకొండ మండల కేంద్రం నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తారు. అయినప్పటికీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఆయా సంబంధిత శాఖ అధికారులు ప్రమాదం జరగక ముందే విద్యుత్తు వైర్లలపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


ముత్యంపేట రోడ్డు ప్రాంతంలో విద్యుత్ వైర్లపై విరిగిపడిన చెట్టు

రథోత్సవాల కోసం రూ.51వేలు విరాళం


విరాళం అందజేస్తున్న సంతోష్ మేస్త్రి

:నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని రథంగల్లీలో గల శ్రీ లక్ష్మీనారాయణ రథోత్సవాలు ఈనెల 23, 24 రెండు రోజులపాటు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ ఉత్సవాల కోసం మద్నూర్ మండల కేంద్రానికి చెందిన సంతోష్ మేస్త్రి రూ.51వేలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఉత్సవాల కోసం భారీ మొత్తంలో విరాళం అందజేసిన సంతోష్ మేస్త్రికి శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సందుర్‌వార్ హనుమాన్లు, కమిటీ ప్రధాన కార్యదర్శి కంచివార్ రవి, ఆలయ కమిటీ కోశాధికారి కంచిన్వార్ నాగేష్, గ్రామపెద్దలు మద్నూర్ సింగిల్‌విండో మాజీ చైర్మన్ పాకల్‌వార్ విజయ్, బొగ్గులవార్ సంజు, అవార్వార్ హనుమాన్లు, అవార్వార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ గౌస్ ఉద్దీన్

నవతెలంగాణ-రెంజల్

గ్రామాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన కార్యదర్శులపై చర్యలు తప్పవని ఎంపీడీవో హెచ్ శ్రీనివాస్, ఎంపీఓ గౌస్ ఉద్దీన్లు స్పష్టం చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీడీవో చాంబర్లో కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండడం, క్రమం తప్పకుండా ఈఎంఐ చెల్లించడం, తదితర అంశాలపై కార్యదర్శులకు సూచనలు ఇచ్చారు. ప్రతి గ్రామంలో తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ బ్లీచింగ్ పౌడర్ వేసి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని వారు సూచించారు. గ్రామ గ్రామ కార్యదర్శులు శ్రీకాంత్, నవీన్, రాజు, వెంకటరమణ, సాయిబాబా సతీష్ చంద్ర, బి. రాణి, గౌతమి, అఫ్రీన్ తదితరులుపాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

సకాలంలో ధాన్యం కొనుగోలు చేపట్టాలి

నవతెలంగాణ-నిజాంసాగర్

కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మహమ్మద్ నగర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి జయ ప్రదీప్ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. ధాన్యం బస్తాల తరలింపునకు సకాలంలో లారీలు సరఫరా చేయాలని, కొనుగోలు కేంద్రాలు మందకోడిగా సాగుతున్న తీరును వారు కలెక్టర్‌కు వివరించారు. దానికి కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని సకాలంలో లారీలు వచ్చే విధంగా చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని కలెక్టర్ సూచించారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి

- పెగాడపల్లి పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జవేరియా

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని పిహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జవేరియా అన్నారు. బుధవారం ఆమె అమ్దాపూర్ సబ్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి ఇమ్యూనైజేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రతిరోజు ఎంతమంది రోగులు వస్తున్నారు, వారికి అందిస్తున్న సేవలపై ఆమె వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలని ఆమె సూచించారు.


అమ్దాపూర్‌లో ఇమ్యూనైజేషన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్

చురుగ్గా కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామంలోని స్థానిక చెరువులో ఉపాధి హామీ పనులకు కూలీలు పెద్ద మొత్తంలో హాజరై పనులను బుధవారం ప్రారంభించారు. రాత్రి కురిసిన అకాల వర్షానికి చెరువులో మట్టి తొలగించడానికి సుమారు 350 మంది కూలీలు ఉపాధి పనులను చేపట్టారని క్షేత్ర సహాయకుడు నారాయణ పేర్కొన్నారు. వాతావరణం చల్లబడడంతో కూలీల సంఖ్య పెరిగిందని ఆయన తెలిపారు. వ్యవసాయ పనులు పూర్తవ్వడంతో చాలామంది కూలీలు ఉపాధి పనులపై దృష్టి సారించారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కొలతలను బట్టి కూలీలు పనులు చేసుకుంటున్నారని, రైతులు ఆ మట్టిని తమ పంట పొలాల్లోకి తరలించడానికి ట్రాక్టర్ల ద్వారా ముందుకు రావడంతో కూలీలకు మరింత సులభతరంగా మారిందని ఆయన తెలిపారు.


పనులు చేస్తున్న కూలీలు

18న జిల్లా కేంద్రంలో స.హ.చట్టం 2005పై ఉచిత శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఆర్‌టీఐ ప్రతినిధులు

నవతెలంగాణ-కామారెడ్డి

సమాచార హక్కు చట్టం 2005 పైన ఉచిత శిక్షణ తరగతులను రాష్ట్ర డైరెక్టర్ సలీం ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం వి భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం, రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ మొహమ్మద్ సాహిల్ ఖాన్, రాష్ట్ర కార్యవర్గం, జోనల్ అధ్యక్షులు సిర్నాపల్లి ప్రదీప్ కుమార్ పాల్గొని సమాచార హక్కు చట్టంపై వివరిస్తారని తెలిపారు. ఈ ఉచిత శిక్షణ తరగతులను కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 18-05-2024న ఉదయం 9:30 నిమిషాలకు నిర్వహిస్తున్నామని అన్నారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పూరిగుడిసెలో నివాసం ఉంటున్న కుటుంబానికి టార్పాలిన్ వితరణ


టార్పాలిన్ అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలో పూరి గుడిసెలో నివాసం ఉంటున్న పేద కుటుంబానికి ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు మదన్ మోహన్ ఆదేశాల మేరకు టార్పాలిన్‌ను వితరణ చేశారు. ఎమ్మెల్యే గత కొన్ని రోజుల క్రితం బైక్ ర్యాలీలో గ్రామంలోని తిరుగుతున్న సమయంలో దళిత కుటుంబానికి చెందిన తలారి ఎల్లయ్య అనే వ్యక్తి పక్షవాతంతో బాధపడుతుండడంతో 'మమ్మల్ని ఆదుకోవాలి' అని వారి కుటుంబీకులు ఎమ్మెల్యేకు తెలుపడంతో వెంటనే గుడిసెపై కప్పడానికి బుధవారం టార్పాలిన్ కవర్ అందించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులకు ఆదేశించారు. ఇందిరమ్మ ఇల్లును తప్పకుండా మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య, నగర్ గ్రామ అధ్యక్షులు చిందం రాజయ్య, ఎస్సీ సెల్ మండల జనరల్ సెక్రెటరీ జగ్గ బాలరాజ్, గ్రామ యూత్ అధ్యక్షులు కోతి మహేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నల్ల మైపాల్‌రెడ్డి, ఆసరాజు, ఆస సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసిన మలావత్ పూర్ణ


చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న మలావత్ పూర్ణ

నవతెలంగాణ-కామారెడ్డి

ఇటీవలే కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన గడ్డం ఇందుప్రియా చంద్రశేఖర్‌రెడ్డిని ఎవరెస్ట్ శిఖర అధిరోహించిన మలావత్ పూర్ణ మున్సిపల్ ఛాంబర్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యంత చిన్న వయసులో ఎవరెస్టు శిఖరం అధిరోహించిన మలావత్ పూర్ణ మరిన్ని శిఖరాలు అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్స్, ఫ్లోర్ లీడర్ పాత శివ కృష్ణమూర్తి, అన్వర్ అహ్మద్, సలీం, తేజపు ప్రసాద్, మమత సాయిబాబు, తాటిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా ఎమ్మెల్యే

- రూ.లక్ష 60వేల ఎల్ఓసీ అందజేత


ఎల్.ఓ.సి ని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల గ్రామానికి చెందిన పడెకుల నర్సింలు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఎన్ని మందులు వాడిన తగ్గుముఖం పట్టకపోవడంతో హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రిలో డాక్టర్‌ను సంప్రదించగా గుండే అపరేషన్ చేయాలని చెప్పారు. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో ఈ విషయాన్ని గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో నిమ్స్ హాస్పిటల్ డాక్టర్‌తో మాట్లాడి నరసింహులుకు ప్రభుత్వం తరపు నుంచి రూ.1,60,000 ఎల్.ఓ.సిని అందజేశారు. దీంతో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే మదన్మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

కమ్మర్‌పల్లిలో మోస్తారు భారీ వర్షం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండల కేంద్రంలో సాయంత్రం ఓ మోస్తారు భారీ వర్షం కురిసింది. ఉదయం నుండి భానుడి పతాపంతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు మోస్తారు భారీ వర్షంతో ఉపశమనం లభించింది. మొదట ఈదురు గాలులతో ప్రారంభమైన వర్షం తర్వాత ఈదురు గాలులు తగ్గి మోస్తారు భారీ వర్షం కురవడంతో ఉక్కపోత నుండి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని కల్లేడ గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కల్లెడ గ్రామానికి చెందిన ఉమ్మెడ చిన్నారెడ్డి(47) మంగళవారం రాత్రి కురిసిన గాలి వానకు నేలకొరిగిన మోటార్ డబ్బా, తెగిన వైర్లను బుధవారం సాయంత్రం సరి చేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కూతుర్లు, ఒక్క కుమారుడు ఉన్నారు. మృతుని భార్య చిన్న నర్సు బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నర్సయ్య తెలిపారు.



పొలంవద్ద రైతు మృతదేహం

వ్యవసాయ అధికారి మృతికి నివాళ్లు



ఏవో మృతదేహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ధర్పల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్‌కు అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు బుధవారం నివాళులు అర్పించారు. భీంగల్ మండల పరిధిలోని చేంగల్ గ్రామానికి చెందిన ప్రవీణ్ ధర్పల్లి మండల వ్యవసాయ శాఖ అధికారిగా గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, సిబ్బంది తక్కువ ఉన్నప్పటికీ రైతులకు అందుబాటులో ఉండేవారని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ప్రధాన కార్యదర్శి. వి ప్రభాకర్, కార్యదర్శి దేవారం అన్నారు. ప్రవీణ్ ప్రాతివదేహానికి పూలమాల తో నివాళులర్పించారు.. వ్యవసాయ శాఖ ఉద్యోగుల సమస్యల్ని ఒక సంఘ బాధ్యుడిగా సామరస్యంగా పైఅధికారులతో చర్చించి పరిష్కరించేవాడనొ అన్నారు. మరోవైపు రైతు సంఘాలతో కూడా స్నేహపూర్వకంగా ఉండేవాడని తాను భౌతికంగా దూరం కావడం ఎంతో బాధకరమని అన్నారు. తన కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ ధైర్యంగా ఉండాలని కోరుతూ సంతాపం తెలియజేశారు.. నివాళులర్పించిన వారిలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు బాబన్న, దేవారం సిరికొండ నాయకులు బాల్ కిషన్, సత్యనారాయణ, పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎం నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల తీవ్ర సంతాపం..


ధర్పల్లి మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ మృతి పట్ల ఏడిఏ విజయలక్ష్మి, వేల్పూర్ ఆర్మూర్ వ్యవసాయ అధికారులు నర్సయ్య, హరికృష్ణ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో అడ్మిషన్లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

2024-25 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో 1వ తరగతి (నాన్-రెసిడెన్షియల్)లో 102 , 5వ తరగతి (రెసిడెన్షియల్) లో 101 సీట్లు కేటాయించినందున ప్రవేశాల కోసం అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాలు ఐడిఓసిలోని షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఈనెల 19 నుండి జూన్ 07 వరకు కార్యాలయ పని వేళలలో తీసుకోవాలని పేర్కొన్నారు. 1వ తరగతి లో దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2018 జూన్ 01 నుండి 2019 మే 31 మధ్య జన్మించిన వారై ఉండాలని, వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో లక్షా50వేలు, పట్టణ ప్రాంతాల్లో 2లక్షల రూపాయలకు మించరాదని తెలిపారు. 5వ తరగతిలో దరఖాస్తు చేసుకునే విద్యార్థులు, 4వ తరగతి బోనఫైడ్, ప్రోగ్రెస్ కార్డు జిరాక్స్‌ను తప్పనిసరిగా దరఖాస్తుకు జతపరచవలెను అని, కుల ధృవీకరణ పత్రం ఆదాయ ధృవీకరణ పత్రం (01-04-2024 తదుపరి నుండి తహశీల్దారు ద్వారా జారీ చేసినది), నేటివిటీ ధృవీకరణ పత్రము (తహశీల్దారు ద్వారా జారీ చేసినది), పుట్టిన తేది ధృవీకరణ పత్రము (తహశీల్దారు, మున్సిపాలిటీ, మున్సిపాల్ బోర్డ్ ద్వారా జారీ చేసినది), ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా గెజిటెడ్ అధికారిచే అటెస్టేషన్ చేయించాలని పేర్కొన్నారు. ఏ ఒక్క ధ్రువపత్రాన్ని జతపర్చకపోయినా ఆదరఖాస్తులు తిరస్కరిస్తారని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారములను జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో జూన్ 07 సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని, నిర్ణీత కాల వ్యవధి తర్వాత అందిన దరఖాస్తులు స్వీకరించబడవు అని సూచించారు. జూన్ 11 న జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిన ఎంపిక చేయబడును అని వివరించారు.

సవాల్‌కు ప్రతి సవాల్





నవతెలంగాణ-మద్నూర్

ఈనెల 13న జరిగిన జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మద్నూర్ మండలంలోని పెద్దఎక్లారా గ్రామంలో మొత్తం పోలైన ఓట్లు 1737 కాగా వీటిలో 1000 ఓట్లు మాకంటే మాకే పడ్డాయంటూ బిజెపి కాంగ్రెస్ పార్టీల నాయకులు సవాళ్లు విసురుకుంటున్నారు. బుధవారం ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అభిషేక్ పటేల్ పోలైన ఓట్లలో వెయ్యి ఓట్లు కాంగ్రెస్‌కు పడ్డాయంటూ సవాల్ విసరగా.. కాంగ్రెస్‌కు కాదు.. బిజెపికే వెయ్యి ఓట్లు పడ్డాయంటూ ఆ గ్రామ బిజెపి పార్టీ నాయకులు, మద్నూర్ సింగిల్ విండో మాజీ అధ్యక్షులు పండిత్ రావు పటేల్ సవాల్ చేశారు. ఈ విధంగా ప్రతి గ్రామంలో ఈసారి జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పోటాపోటీగా అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన నాయకులు ఈ విధంగా సవాలు చేస్తుండటం గమనార్హం.

నేడు ఎడపల్లి మండలం సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఎడపల్లి

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎడపల్లి ఎంపీడీవో ఎన్.శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడపల్లి ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా, మండల అధికారులతో పాటు, ఎడపల్లి మండల గ్రామ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారినీలతో పాటు, జడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను తమ వెంట తీసుకుని సర్వసభ సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు. సర్వసభ్య సమావేశానికి గైహాజరైన అధికారుల పేర్లను సంబంధిత జిల్లాస్థాయి ఉన్నతాధికారులకు నివేదించనట్లు ఆయన పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంపై అశ్రద్ధ ఎందుకు?

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

రెండేళ్ల నుంచి ప్రతి మూడు నెలలకోకసారి జరుగుతున్న మండల సర్వసభ్య సమావేశంలో తమ గ్రామప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను విన్నవించినా వాటిని పరిష్కరించడంలో ఎందుకు అశ్రద్ధ చేస్తున్నారని మండల కోప్షన్ మెంబర్ ---జామ్తో పాటు పలువురు ఎంపీటీసీలు ప్రశ్నించారు. బుధవారం ఎంపీపీ బానోత్ అనూష ప్రేమ్ దాస్ అధ్యక్షతన నిజామాబాద్ రూరల్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తిర్మన్‌పల్లి గ్రామంలో 45 మంది నిరుపేదలకు బయోమెట్రిక్‌లో వేలిముద్రలు రానందున వారికి రేషన్ బియ్యం ఇవ్వడం లేదని, పెన్షన్ డబ్బులు కూడా సమయానికి ఇన్యకపోవటంతో ఆ కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఈదురుగాలులు వచ్చినప్పుడల్లా తిర్మన్పల్లిలోని మైనార్టీ ఏరియాలో కరెంట్ సరఫరా నిలిచిపోతున్నందున తాగునీరు అందక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. నిన్న రాత్రి వీచిన బలమైన ఈదురుగాలులకు కరెంట్ సరఫరా నిలిచిపోయి ఇప్పటికీ కూడా వాటిని పునరుద్ధరించలేదని తెలిపారు. గుండారం గ్రామంలో మిషన్ భగీరథ తాగునీరు సరిపడ అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామంలో ఉన్న చెడిపోయిన చేతి పంపులను వెంటనే మరమ్మతులు చేయించాలని గ్రామ ఎంపిటిసి కోరారు.



సమావేశంలో సమస్యలపై ప్రశ్నిస్తున్న సభ్యులు

ఇందుకు ఇన్చార్జి ఎంపీడీఓ మధురిమ స్పందిస్తూ చేతిపంపులను వెంటనే మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటానని చెప్పడంతో సభ్యులు శాంతించారు సమావేశంలో జడ్పీటీసీ బొల్లెంక సుమలత గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, ఎంపీడీఓ మదురిమ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ఎన్నికల రిజర్వేషన్ ఖరారు

- త్వరలో ఎన్నికలు
- సోషల్ మీడియాలో వదంతులు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

సోషల్ మీడియాలో సర్పంచ్‌ల ఎన్నికల రిజర్వేషన్ ఖరారు, త్వరలో ఎన్నికలు అనే వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ అంశంపై ప్రభుత్వం నుండి ఎలాంటి ఉత్తర్వులు జారీ కాలేదని, ఈ విషయాన్ని గమనించాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కార్యాలయం నుండి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ రూరల్ నియోజక వర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సోషల్ మీడియాలో వస్తున్న వదంతు లను నమ్మొద్దని ప్రకటనలో కోరారు.

పట్టణ ట్రాఫిక్ సిఐగా ఓడి రమేష్



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ట్రాఫిక్ సిఐగా ఓడి రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశానుసారం ట్రాఫిక్ సిఐ రమేష్ అంబేద్కర్ చౌరస్తా, మామిడిపల్లి చౌరస్తా వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మూర్ పట్టణంలో ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. వాహనాలను రోడ్డుపై పార్క్ చేయవద్దని చెప్పారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఆనంద్, పీసీ నర్సింగ్ రావు, నారాయణ, హెూం గార్డ్ మోహన్ పాల్గొన్నారు.

నిలిపిఉన్న లారీని ఢీకొని యువకుడు మృతి

నవతెలంగాణ-పిట్లం

నిలిపి ఉన్న లారీని ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన పోతిరెడ్డిపల్లి (రూమ్ తాండ) వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లి గ్రామానికి చెందిన బోట్ల పండరి (30) మంగళవారం తన అత్తగారిల్లు అయిన పిట్లం మండలం రాంపూర్ గ్రామానికి వచ్చి తిరిగి తన బైకుపై ఇంటికి వెళ్తుండగా.. మార్గమధ్యంలో గల మండలంలోని పోతిరెడ్డిపల్లి (రూమ్ తాండ) వద్ద రోడ్డుపై నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా నిలిపి ఉన్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొనడంతో రోడ్డుపై కింద పడ్డాడు. తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య గంగామణి (కవిత) ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతునికి ఇద్దరు కూతుర్లున్నారు.



ఘటనా స్థలంలో యువకుడి మృతదేహం

గుండెపోటుతో మండల వ్యవసాయ అధికారి మృతి

నవతెలంగాణ-ధర్పల్లి

మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ (42) బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో గుండెపోటుతో మృతిచెందాడు. పార్లమెంటు ఎన్నికల్లో విధులు నిర్వహించిన అనంతరం డిచ్‌పల్లి స్ట్రాంగ్ రూముల వద్ద విధుల్లో ఉన్నట్లు తెలిసింది. మృతుడు బీమ్ గల్ మండలంలోని ఛేంగల్ గ్రామానికి చెందినవ్యక్తి. 12 సంవత్సరాలుగా ధర్పల్లి మండలంలో విధులు నిర్వహించి, రైతులతో, ఆయా శాఖల అధికారులతో, మండల ప్రజాప్రతినిధులతో, ప్రజలతో కలిసిమెలిసి ఉండేవాడు. మృదువు స్వభావం అందరిని కలుపుకుపోయే తత్వం గల అధికారిగా పేరు సంపాదించారు. అలాంటి వ్యక్తి మృతి చెందడం బాధాకరమని మండల రైతులు, అధికారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈయన జిల్లా ఏఓల సంఘం అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. మృతునికి భార్య స్వాతి, కూతురు శ్రీహర్ష శ్రీహిత్ ఉన్నారు. ఆయన మృతితో ఛేంగల్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుని పిల్లల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. తన స్వగ్రామంలో జరిగిన అంతక్రియల్లో వందలాదిగా అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు తరలి వెళ్లారు.



ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

హంస వాహనంపై ఊరేగిన నారసింహుడు



నవతెలంగాణ-భీంగల్ రూరల్

పట్టణంలోని పురాతన గ్రామాలయంలో సోమవారం నుండి ప్రారంభం అయిన శ్రీ లక్ష్మీ నృసింహుని జయంతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మూడవ రోజు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై ఊరేగించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై స్వర్ణభరణాలు అలంకరించిన శ్రీ లక్ష్మీ నృసింహుల ఉత్సవ విగ్రహాలను ఉంచి అంగరంగ వైభవంగా ఊరేగించారు. మంగళ వాయిద్యాలు, భక్తుల జయ జయ ధ్యానాలతో నృసింహుని జయంతి ఉత్సవాలు కొనసాగాయి. ఉత్సవాలను నంబీ లింబాద్రి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నారు. జయంతి ఉత్సవాలలో భక్తులు పాల్గొని శ్రీ లక్ష్మీ నరసింహుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమం నిర్వహించారు.

మ్యుజీషియన్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారతీయ వాయు సేన (ఐఏఎఫ్) రిక్రూట్మెంట్ ర్యాలి "అగ్నిపథ్ స్కీం" ద్వారా భారతీయ వాయు సేన నందు "అగ్నివీర్ వాయు (మ్యుజిషియన్)" ఉద్యోగం కొరకు ఆన్ లైన్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలంగాణా ఆంధ్రప్రదేశ్ రిక్రూటింగ్ ఆఫీసర్ 12 ఎయిర్ మెన్ సెలక్షన్ సెంటర్, ఐఏఫ్ బోయిన్‌పల్లి, సికింద్రాబాద్ వింగ్ కమాండర్ గురుప్రీత్ అత్వాల్, కమాండింగ్ ఆఫీసర్ ఆదేశానుసారం జిల్లా యువజన క్రీడాల అధికారి ముత్తన్న ఒక ప్రకటన లో తెలిపారు. ఆన్ లైన్ వెబ్ పోర్టల్ https://agnipathvavu.cdac.in నందు ఈనెల 22 ఉదయం 11 గంటల నుండి జూన్ 05 రాత్రి 11 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. 02-01-2004 నుండి 02-07-2007 మధ్యలో జన్మించి ఉండాలని, పెళ్లి కాని పురుషులు లేదా మహిళలు ఇట్టి ఉద్యోగానికి అర్హులు అని తెలిపారు. 10వ తరగతి లేదా దానికి సమానమైన తరగతినందు పాసై ఉండాలని, అభ్యర్థికి తప్పని సరిగా సంగీతంలో ప్రావీణ్యం ఉండాలి, వాయిద్యాల విషయంలో ట్యూనింగ్ చేయగలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు https://agnipathvavu.cdac.in వెబ్ పోర్టల్‌లో చూడాలకి తెలిపారు.

పడకల్ లైబ్రరీకి పుస్తకాల వితరణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

విజ్ఞానం, వినోదం అందించే పుస్తకాలను అందరూ చదవాలని ఉషా బాల పవన్ కుమార్ గారి గొర్తి ఈశ్వర ట్రస్టు స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సంస్థ నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు పాట్యూరి తిరుపతిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ట్రస్ట్ ఆధ్వర్యంలో సినారె సరస్వతం, బొడ్డులో సంచి భారతదేశంలో తత్వశాస్త్రం తదితర 40 రకాల పుస్తకాలను మండలంలోని పడకల్ గ్రామీణ గ్రంథాలయానికి బుధవారం వితరణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంకం నరేష్, అల్లూరి గంగారెడ్డి, సట్ల సాయన్న లోకపురుషోత్తం, మహేందర్ రెడ్డి, బాలా గౌడ్, సుమన్, ప్రవీణ్, రుస్తుంఖాన్, తంబాకుల గంగారెడ్డి, గ్రంథపాలకులు, రీడర్స్ పాల్గొన్నారు.



కోటగిరిలో లయన్స్ భవనం ప్రారంభం

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో 2008 నుంచి లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి సభ్యులు నిరంతరం సేవ చేస్తున్న కోటగిరి గ్రామానికి చెందిన పోల విట్టల్‌రావు గుప్తా వారి కుమారుడు, కోడలు, మనవడు, మనవరాలు పోల రాఘవేందర్, దీప్తి, సాయితేజ, సాయి సిగ్న పేరుమీద రాఘవేంద్ర దీప్తి మెమోరియల్ కోటగిరి లయన్స్ భవన్‌ను నిర్మించి కోటగిరి లయన్స్ క్లబ్ వారికి బుధవారం అందజేశారు. లయన్స్ క్లబ్ వారికి కోటగిరి గ్రామపంచాయతీ స్థలాన్ని గతంలో కేటాయించడంతో భవన నిర్మాణం పూర్తి కావడంతో లయన్స్ ఇంటర్నేషనల్ 320డి గవర్నర్ వేమూరి లక్ష్మి లయన్స్ భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోటగిరి లయన్స్ క్లబ్ సేవలు మరువలేనివని అన్నారు. మరింత విస్తృతంగా సేవలు చేయాలని పేర్కొన్నారు. ఆది, బుధవారం కంటి పరీక్షలు బోధన్ లయన్స్ క్లబ్ చేయూతతో నిర్వహిస్తామని పేర్కొన్నారు. లయన్స్ భవన నిర్మాణానికి సహకరించిన గుప్తా కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలవిఠల్ కుటుంబ సభ్యులు లైన్ నిశాంత్, సంతోష్, లైన్ పెద్దలు మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ లైన్ పోలవరపు బసవేశ్వరరావు, లైన్‌పెద్దలు కొడాలి కిషోర్, ఎర్రగడ శ్రీనివాసరావు, జాస్తి శివ నాగేశ్వరరావు, నరసయ్య, కోటగిరి లయన్స్ క్లబ్ అధ్యక్షులు హనుమంతరావు, సెక్రటరీ జానకిరావు, ట్రెజరర్ అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ స్వరూప, తాజా మాజీ సర్పంచ్ లయన్ పత్తి లక్ష్మణ్, కోటగిరి విండో అధ్యక్షులు, లయన్ సిద్దు, సభ్యులు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభించిన వేమూరి లక్ష్మి

స్వగ్రామంలో అత్యక్రియలు

- గుండెపోటుతో మస్కట్‌లో మృతి

నవతెలంగాణ - మాక్లూర్



గుండెపోటుతో యువకుడు మస్కట్ లోని ఒమన్ లో మృతి చెందాడు. బుధవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మండలంలోని కిందితండకు చెందిన బట్టు రాము(40) మస్కట్‌లో మృతి చెందాడు. కుటుంబీకుల కథనం ప్రకారం మస్కట్‌లోని ఒమన్‌లో విధులు నిర్వహిస్తుండగా ఈ నెల 7న గుండెపోటు రావడంతో అక్కడిక్కడే మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుక వచ్చి అంత్య క్రియలు నిర్వహించారు. మృతునికి ఇద్దరు కుమారులు, బార్య ఉన్నారు.